క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



పాలకుర్తి టౌన్: వల్మిడి సీతారామచంద్రస్వామి ఆలయంలో ఏప్రిల్ 2 నుంచి 12 వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఆలయ అధికారులు, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రంజాన్ పండుగ పురస్కరించుకుని మదర్సా పాఠశాల విద్యార్థులకు జెడ్పీ కో అప్షన్ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు ఎండీ మదార్ అందజేసిన దుస్తులను కాంగ్రెస్ నియోజవర్గ ఇన్‌చార్జి హనుమండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

పంటలకు సాగునీరు అందించాలి

● మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి



జనగామ రూరల్: జిల్లాలోని దేవాదుల ప్రాజెక్టు పరిధిలో వందశాతం కాల్వల నిర్మాణం చేపట్టి పంటలకు సాగునీరు అందించాలని మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా తృతీయ మహాసభల సందర్భంగా గురువారం సోమయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనేక పోరాటాల ఫలితంగా ఈ ప్రాంతంలో దేవాదుల స్కీంలో 13 రిజర్వాయర్ల నిర్మాణం జరిగిందని, అయితే ఇప్పటి వరకు కొన్ని ప్రాంతాల్లో మెయిన్ కెనాల్స్ పూర్తి కాక సాగునీరు అందడంలేదన్నారు. యాసంగి సీజన్‌లో సాగు చేసిన 25 శాతం పంటలు ఇప్పటికే ఎండిపోయాయని, ప్రజాప్రతినిధులు స్పందించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల పరిహారం ఇవ్వాలన్నారు. అనంతరం రైతు సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆది సాయన్న, ప్రధాన కార్యదర్శిగా చొప్పరి సోమయ్య, ఉపాధ్యక్షులుగా బోనగిరి కుమారస్వామి, పిన్నింటి రాజిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా పెండ్యాల సమ్మయ్య, కొత్త సుధాకర్‌రెడ్డి, ఎండీ.యాకూబ్ పాషా, ఉమ్మెత్తల వెంకటరెడ్డి, జోగు పర్శరాములు, ఉండబోయిన రవి, రుద్రోజు ఉప్పలయ్య, సాదం అశోక్, మర ముప్పిడి ఎల్లయ్య, హనుమాజీ, బండారి యాదగిరి, వెంకటయ్యలే ఎన్నికైనట్లు రాజారెడ్డి తెలిపారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



జనగామ: యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అన్ని రంగాల్లో రాణించాలని సైంటిస్ట్ ఆఫ్ డిఫెన్స్ ఎల్ ఎ.నరేంద్రబాబు అన్నారు. స్థానిక హైదరాబాద్‌రోడ్డు ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో గురువారం కలామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యాన డీఆర్డీఎల్, డీఆర్డీఓ, ఎన్ఆర్ఎస్‌సీ సంయుక్త భాగస్వామ్యంతో 24 ఇస్రో మోడల్ మిస్సైల్స్ ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల కార్యదర్శి చిర్ర ఉపేందర్‌రెడ్డి, డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సిబ్బంది

● వారంలో మూడురోజులు కూడా తెరవని గ్రంథాలయం
● అసహనం వ్యక్తం చేస్తున్న పాఠకులు

నర్మెట: మండల కేంద్రంలోని గ్రంథాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పాఠకులు కోరుతున్నారు. శుక్రవారం, రెండో శనివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 8నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు తెరచి ఉండాల్సిన గ్రంథాలయం వారంలో కనీసం రెండు, మూడు రోజులు కూడా తెరవడంలేదని విద్యార్థులు, నిత్యం గ్రంథాలయానికి వచ్చే పాఠకులు అసహనం వెలిబుచ్చుతున్నారు. లైబ్రేరియన్ ఎప్పుడు వస్తాడో తెలియదు, స్థానికంగా ఉండే సహాయకుడు సొంతపనులకే పరిమితమవుతుండటంతో పాఠకులు ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు చెబుతున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు. విద్యార్థులకు పరీక్షలు జరుగుతుండటంతో విషయ సేకరణకోసం వెలితే మూసి ఉంటోందని తెలిపారు. స్వాతంత్ర్యం కన్నా ముందు నుంచి నర్మెటలో గ్రంథాలయం ఉందని, ప్రస్తుతం సిబ్బంది సయపాలన పాటించడం లేదని అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నర్మెట: మూసి ఉన్న గ్రంథాలయం

ఇబ్బందికరంగా ఉంది..

ప్రజలకు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయం అడపాదడపా తెరచి ఉండటం ఇబ్బందికరంగా ఉంది. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు. నిత్యం ఎంతో మంది పాఠకులు, విద్యార్థులు.. సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలి.



- ఎండీ తఫ్షిల్, పాఠకుడు, నర్మెట

చర్యలు తీసుకుంటాం..

నర్మెటలో లైబ్రేరియన్ లేక పోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్వీపర్ పూర్తి స్థాయి విధులు నిర్వహిస్తున్నాడు. అతను రెగ్యులర్‌గా రావడం లేదని మా దృష్టికి వచ్చింది. తగుచర్యలు తీసుకుంటాం.



- మొగల్‌గిద్ది సుధీర్, కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

● ఎమ్మెల్యే కడియం శ్రీహరి

లింగాలఘణపురం/రఘునాథపల్లి/చిల్పూర్: నియోజక అభివృద్ధే ధ్యేయం.. ఇందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం లింగాలఘణపురం, రఘునాథపల్లి, చిల్పూర్ మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, సాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ ఫండ్స్ చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా ఉంటుందని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. నియోజకవర్గానికి 5వేల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని, రాజకీయాలకతీతంగా అర్హులకు మంజూరు అవుతాయని చెప్పారు. ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తామని, ఇప్పటికే ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలను గోదావరి జలాలతో నింపినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దేవాదుల ప్రాజెక్టు తదితర సాగునీటి రంగానికి ప్రభుత్వం రూ.23వేల కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్ విషయమై గొప్పలకు పోకుండా వాస్తవికతకు అద్దం పట్టేలా ఉందని అన్నారు. ఆర్డీఓ గోపీరాం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, తహసీల్దార్లు రవీందర్, ఎండీ.మోహిన్సముజ్జబ, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం, జీడికల్ దేవస్థాన చైర్మన్ మూర్తి, చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఎంపీడీఓలు, మార్కెట్ చైర్మన్ శివకుమార్, డైరెక్టర్లు పాల్గొన్నారు.



లింగాలఘణపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జమిలి ఎన్నికలతోనే అభివృద్ధి



నర్మెట: సమావేశంలో పాల్గొన్న నాయకులు

● బీజేపీ రాష్ట్ర నాయకుడు సుభాష్

నర్మెట: జమిలి ఎన్నికలే దేశ అభివృద్ధికి సోపానమని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మండల ఇన్‌చార్జ్ బొజ్జపల్లి సుభాష్ అన్నారు. ఒకే దేశం..ఒకే ఎన్నిక నినాదంలో భాగంగా మండల కేంద్రంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రంగు మురళి అధ్యక్షతన గురువారం నిర్వహించిన వర్క్ షాప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే జమిలి ఎన్నికల నిర్వాహణతోనే సాధ్యమన్నారు. జిల్లా కార్యదర్శి, మండల ఎన్నికల కన్వీనర్ ధరావత్ రాజు, కో కన్వీనర్ సొక్కం అనిల్ కుమార్, నాయకులు అశ్విని, చెవుల రాజు, జహంగీర్, మెతుకు సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

ఒకే దేశం, ఒకే ఎన్నికతో ఎంతో మేలు

రఘునాథపల్లి: ఒకే దేశం, ఒకే ఎన్నికతో ఎంతో మేలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాము అన్నారు. మండల కేంద్రంలో ఒకే దేశం, ఒకే ఎన్నిక అనే అంశంపై బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్ అధ్యక్షతన, మండల కన్వీనర్ కావటి ముత్యాల్‌యాదవ్ ఆధ్వర్యంలో వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ప్రతి ఏడాది ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతుండటంతో అభివృద్ధికి తీవ్ర ఆటంకం కలుగుతోందన్నారు. జమిలి ఎన్నికలతో ఆర్థిక ప్రయోజనాలు, పాలనలో స్థిరత్వం, దేశాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రోగ్రాం మండల కోకన్వీనర్ ఉడుత రంజిత్‌యాదవ్, బీజేపీ జిల్లా కార్యదర్శి మంద వెంకటేశం, కల్వగూరి ప్రభాకర్, తిరుమల్‌ప్రసాద్, దుర్గాప్రసాద్, గాదె ఉపేందర్, భోళ్ల అఖిల్, రవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: ఒకే దేశం ఒకే ఎన్నికతో దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చింతకింది సంతోష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై పార్టీ ముఖ్యకార్యకర్తలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్, నాయకుడు ఎండీ వలిపాష, గద్దం రాజు, బుర్ర తిరుపతి, ఇల్లందుల సారయ్య, సింగారపు రమేష్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో కలెక్టర్ దంపతులు

జనగామ: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కలెక్టర్ కార్యాలయంలో టీఎస్‌జీఓస్ ఆధ్వర్యాన గురువారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డీసీపీ రాజమహేంద్రనాయక్, తదితర ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్ దంపతులు హాజరయ్యారు. మత పెద్ద అబ్దుల్ హఫీజ్, కలెక్టరేట్ ఉద్యోగులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు(నమాజ్) చేశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓ గోపీరాం, టీఎస్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఖాజా, కలెక్టరేట్ ఏఓ మన్సూరీ తదితరులు పాల్గొన్నారు.

బారికేడ్ల అందజేత

జనగామ: పట్టణంలోని మను మెటర్నిటీ హాస్పిటల్ మొదటి వార్షికోత్సవం పురస్కరించుకుని రూ.25వేల విలువ చేసే బారిగేడ్లను గురువారం పోలీసు శాఖకు అప్పగించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ దామోదర్‌రెడ్డి సమక్షంలో డాక్టర్లు వంశీ, పృథ్వీల ఆధ్వర్యంలో అప్పగించగా, అభినందనలు తెలిపారు. ఎస్సైలు భరత్, చెన్నకేశవులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

నర్మెట: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతన్నట్లు డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి అన్నారు. మండలానికి రూ. 2.66 కోట్ల ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు మంజూరు అయ్యాయి. కాగా, మండల కేంద్రానికి రూ. 70 లక్షలు కేటాయించంగా ఊర చెరువు నుంచి ప్రధాన రహదారి వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు పార్టీ శ్రేణులతో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, ఫరీదుల యాదయ్య, భూక్య జయరాం, ప్రజ్ఞాపురం శ్రీధర్, పండ్ల బాలనర్సు, చెవుల పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు చరిత్రాత్మక నిర్ణయం

● కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మౌనిక

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం చరిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి మౌనిక అన్నారు. అసెంబ్లీలో బీసీ బిల్లు ప్రవేశపెట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ మౌనిక ఆధ్వర్యంలో గురువారం ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో సంబురాలు చేపట్టారు. ముందుగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రుల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల నాయకులు కోరుకొప్పుల మహేందర్, నారగోని పద్మ, సంపత్, సునీత, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మౌనిక

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం

బచ్చన్నపేట: రాష్ట్రప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని హర్షిస్తూ సీఎం రేవంత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చిత్ర పటాలకు మండల కేంద్రంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు దాచేపల్లి నర్సింగారావు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. నాయకులు పాల్గొన్నారు.

వర్గీకరణకు ఆమోదముద్ర పొందడంతో..

తరిగొప్పుల: ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదముద్ర పొందిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. వగలబోయిన యాదగిరి, దామెర జయరాజ్, ఎడ్ల నవీన్, దండెం ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పేరు మార్చొద్దు

● జేఏసీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి

జనగామ: జిల్లా పేరు మార్చొద్దని కోరుతూ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు మాట్లాడుతూ జనగామ పేరు చారిత్రక నేపథ్యమని, ప్రజా చైతన్యం రగిలించే స్ఫూర్తి అని, ఈ గడ్డపై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, నల్ల నర్సింహులు, చుక్క సత్తయ్య, బమ్మెర పోతన, పాల్కురికి సోమనాథుడు ఇంకా ఎందరో మహనీయులు జన్మించారని పేర్కొన్నారు. జిల్లా పేరు మార్చాలని ఉద్యమాలు చేయవద్దని కులసంఘాలకు విజ్ఞప్తి చేయడంతోపాటు ప్రభుత్వం కూడా పేరు మార్చకుండా అలాగే ఉంచాలని కోరారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే మండలాలు, అభివృద్ధి కార్యక్రమాలు, జిల్లా గ్రంథాలయం, అడిటోరియం, ఆర్టీసీ చౌరస్తాకు మహనీయుల పేర్లను నామకరణం చేయాలన్నారు. కార్యక్రమంలో టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టల సురేష్, బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఆసర్ల సుభాష్, వందేమాతరం స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నల్లరావు, టీజీవీపీ పట్టణ అధ్యక్షుడు వెంపటి అజయ్, మహమ్మద్ ఇమ్రాన్, మహమ్మద్ అఫ్రోజ్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న జేఏసీ ప్రతినిధులు

బడ్జెట్‌పై నిరసన

జనగామ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎస్సీ, తదితరులకు కాగితాల్లో అంకెలు చూపించి మోసం చేశారని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు అన్నారు. గురువారం జిల్లా కేంద్రం ఆర్టీసీ చౌరస్తాలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో బడ్జెట్‌పై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల డిక్లరేషన్ అమలుకు సంబంధించి బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదని, జనాభా దామాషా ప్రకారంగా రిజర్వేషన్లు పెంచలేదన్నారు. జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్, జిల్లా అధ్యక్షుడు తోటి దేవదానం, జిల్లా ఉపాధ్యక్షురాలు లలిత, శైలజ, ఉప్పలయ్య, యాదగిరి పాల్గొన్నారు.

బడ్జెట్‌ను సవరించాలి

జఫర్‌గఢ్: అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ఉద్యోగ, కార్మిక ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని, వారికి మేలు చేసేలా బడ్జెట్‌ను సవరించాలని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కోటి 50 లక్షల మంది ఉన్న కార్మికులకు కేవలం రూ.900 కోట్లు మాత్రమే ప్రభుత్వ కేటాయించడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో కార్మికుల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన అంశాలు ఈ బడ్జెట్‌లో కన్పించలేదన్నారు. వెంటనే బడ్జెట్‌ను సవరించాలన్నారు.

సాయుధ పోరులో ఠాణునాయక్ పాత్ర కీలకం

కొడకండ్ల: నిజాం నిరంకుశ పాలన, దొరలకు భూస్వాములకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ సాయుధ పోరాటంలో అమరుడైన జాటోత్ ఠాణు నాయక్ పాత్ర మరువలేనిదని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. గురువారం ఠాణూనాయక్ వర్ధంతిని పురస్కరించుకుని గిర్నితండాలో ఠాణూనాయక్ విగ్రహానికి ఝాన్సీరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగారపు రమేశ్ కూడా ఠాణునాయక్‌కు నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఝాన్సీరెడ్డి

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకొంటానని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. కొడకండ్ల, లక్ష్మక్కపల్లి, గిర్నితండాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబసభ్యులను ఆమె పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

ఏసీబీ దాడుల కలకలం

● రెండేళ్ల క్రితం పట్టుబడిన ఒకే శాఖ నుంచి ఇద్దరు అధికారులు
● ప్రస్తుతం స్టేషన్‌ఘన్‌పూర్ సబ్ రిజిస్ట్రార్, అటెండర్
● గతంలోనూ నలుగురు సబ్ రిజిస్ట్రార్లు, ఒక వీఆర్ఓ

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలో గురువారం ఏసీబీ అధికారుల చేపట్టిన దాడులతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రధానంగా స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని చాలా రోజులుగా ప్రజలు చర్చించుకుంటున్నారు. మొదట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం శివునిపల్లిలో ఉన్న సమయంలో 15 ఏళ్ల క్రితం సబ్ రిజిస్ట్రార్ డానియల్‌తో పాటు మరో ముగ్గురు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. పదేళ్ల క్రితం రెవెన్యూశాఖ నుంచి ఒక వీఆర్ఓ పట్టుబడారు. అనంతరం 2022 ఆగస్టులో ఎంపీడీఓ కుమారస్వామి పంచాయతీ కార్యదర్శి వద్ద లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. తర్వాత ఆరు నెలల వ్యవధిలోనే శివునిపల్లి మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కుర్రం చిరంజీవి 2023 మార్చి 2న సీసీ రోడ్ల బిల్లుల కోసం ఒక కాంట్రాక్టర్ వద్ద నుంచి లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. అప్పట్లో ఆరు నెలల్లోపే ఒకే శాఖ నుంచి ఇద్దరు అధికారులు ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారింది. కాగా ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్, అటెండర్ లంచం తీసుకుంటూ పట్టుబడడం చర్చనీయాంశంగా మారింది. అయితే మరో రెండు ప్రధాన శాఖలపై కూడా నిఘా ఉందని తెలుస్తోంది.



స్టేషన్‌ఘన్‌పూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

పరీక్షలు ప్రశాంతంగా రాయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులు పరీక్షల సమయంలో ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. శివునిపల్లిలో ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం పరీక్షప్యాడ్లు, హాల్‌టికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం డి.రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు.

దేవాదుల నీటిని విడుదల చేయాలి

బచ్చన్నపేట: పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించి ఆదుకోవాలని కట్కూర్, బండనాగారం, లక్ష్మాపూర్, బంజేరు గ్రామాల రైతులు కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు శాగగొండ కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు దైవాదుల ఈఈ బి.మంగీలాల్‌ను గురువారం కలిసి విన్నవించారు. దేవాదుల నీటిని వదిలి పంటలు ఎండిపోకుండా కాపాడాలని కోరారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

బచ్చన్నపేట: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని ఆలింపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం..ఆలింపూర్ గ్రామానికి చెందిన జ్యోతి అంజమ్మ(78) ఇంట్లో వాటర్ సంపులో మోటర్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు వైరు తగిలి షాక్‌కు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు జనగామ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలు భర్త వీరమల్లయ్య కూడా పదేళ్ల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఘటనా స్థలానికి ఎస్సై ఎస్‌కే హమీద్ చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి

జఫర్‌గఢ్: సాగునీరు అందక పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇచ్చి వారిని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య, పార్టీ మండల కార్యదర్శి గుండెబోయిన రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎండిన పంటలను గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

అభినందనలు

రఘునాథపల్లి: శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించడంపై మొదటి తరం మాదిగ ఉద్యమకారుల బృందం గురువారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యే ఆహ్వానం మేరకు ఉద్యమ కారులు మేకల నరేందర్‌మాదిగ, ఇబ్రాంశేఖర్‌మాదిగ బృందం హైదరాబాద్‌లో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బాలికల సంక్షేమానికి ఇన్సిరేటర్ ఏర్పాటు

దేవరుప్పుల: బాలికల సంక్షేమం కోసం ఇన్సిరేటర్ దోహదపడుతుందని కస్తూర్బా హాస్టల్ ప్రత్యేకాధికారి సుకన్య తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గిరిజన బాలికల విద్యాలయంలో కలెక్టర్ రిజ్వాన్‌భాషా ఆదేశాల మేరకు బాలికల సంక్షేమ అధికారి గౌసియాబేగం ఆధ్వర్యంలో ఇన్సిరేటర్ ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బంజారా భవవ నిర్మాణ పనులు చేపట్టాలి

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలో బంజారా

సంక్షిప్తంగా

భవన నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏఓ మంచూరికి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. మహేందర్, ప్రదీప్, తిరుపతి, దేవు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి



బచ్చన్నపేట: బండనాగారం గ్రామంలో నూతన దుర్గామాత ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు, దాతలు సహకరించాలని కొమురవెళ్లి దేవస్థాన డైరెక్టర్ కొప్పురపు జయప్రకాశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివరాత్రి కవితరాజనర్సులు కోరారు. గురువారం ఆలయ ఆవరణలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి ముగ్గుపోసి రెండేళ్లయిందని, పనులు పూర్తి చేసి ఉత్సవాలు నిర్వహించుకునేందుకు విరాళాలను సేకరించడం జరుగుతుందన్నారు. సమావేశంలో సురేందర్‌రెడ్డి, సాయిలు, జనార్ధన్, భాస్కర్, శ్రీనివాస్, అంజనేయులు, స్వామి, శ్రీనివాస్‌రెడ్డి, సత్తిరెడి పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత

బచ్చన్నపేట: కొన్నె గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణకు హాజరుకావాలని నిర్వాహకులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యలకు గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు. విగ్రహావిష్కరణ ఈ నెల 23వ తేదీన ఉంటుదని చెప్పారు.

'ఇష్టానుసారంగా సైడ్ కాల్వ నిర్మాణం'

జఫర్‌గఢ్: తమ్మడపల్లి (జి) గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి చేపడుతున్న సైడ్ కాల్వ నిర్మాణ పనులు ఇష్టానుసారంగా చేపడుతున్నారని సీపీఎం మండల నాయకులడు వడ్లకొండ సుధాకర్ అన్నారు. ఈ మేరకు కాలనీవాసులతో కలిసి గురువారం సైడ్ కాల్వల నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించి మాట్లాడారు. అధికారులు కాల్వ నిర్మాణాన్ని పరిశీలించి పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సాగునీరందించాలి

పాలకుర్తి: కల్వల నిర్మాణ పనులు చేపట్టి రైతులకు సాగునీరు అందించాలని సీపీఎం మండల నాయకుడు ఏదునూరి మదార్ కోరారు. గురువారం ఈరవెన్నులో సాయిచెరువు తూము నుంచి వచ్చే నీటిని పార్టీ నాయకులు, రైతులతో కలిసి ఆయన పరిశీలించారు.

క్రీడల్లోనూ రాణించాలి

చిల్పూరు: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అరోరా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పాగాల రఘోత్తంరెడ్డి అన్నారు. రాజవరం గ్రామంలో గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రిని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శౌరీల సమక్షంలో అందజేశారు.

ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక

స్టేషన్‌ఘన్‌పూర్: ఛాగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ కేడెట్ల ఎంపికలను ఎన్‌సీసీ అధికారి రుద్రారపు శాంతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆర్మీ సిబ్బంది డీజీ కుమార్, బాబాసాహెబ్ గీతె విద్యార్థులకు శారీరక, రాత పరీక్షలు నిర్వహించారు. మొత్తం 68 మంది విద్యార్థులు పాల్గొనగా 25 మందిని ఎన్‌సీసీ కేడెట్లుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ కొమురయ్య హాజరై మాట్లాడారు. ఎన్‌సీసీ ద్వారా దేహదారుఢ్యం, క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతుందన్నారు. పాఠశాల ఇంఛార్జీ హెచ్‌ఎం అంజిరెడ్డి, ఎన్‌సీసీ మాజీ ఆఫీసర్ ప్రకాశం, టీచర్లు పాల్గొన్నారు.

మానవ అక్రమరవాణాపై అవగాహన కల్పించాలి

రఘునాథపల్లి: మానక అక్రమరవాణా, లైంగిక వ్యాపారం, సైబర్ ఆధారితలకు సంబంధించిన చట్టాలపై గ్రామాల్లో యువతీ యువకులకు అవగాహన కల్పించి వాటిని నివారించాలని ఏపీఎం సారయ్య సూచించారు. గురువారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏ, ఎస్ఏసీ కమిటీ సభ్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మానవ అక్రమ రవాణా, తదితర నేరాలను నివారించేందుకు అనుచరించాల్సిన విధానాలపై ఆయన అవగాహన కల్పించారు.

మంద కృష్ణ పోరాట ఫలితమే వర్గీకరణ

జఫర్‌గఢ్: మంద కృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాట ఫలితంగానే రాష్ట్ర అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం లభించిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైస రాజశేఖర్ మాదిగ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీరణకు ఆమోదం పొందడాన్ని స్వాగతిస్తూ స్వీట్లు పంపిణీ చేసి మంద కృష్ణ చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

ఇబ్రహీంపూర్ మాజీ సర్పంచ్ మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నేత లింగాల నరసింహారెడ్డి (90) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. 1968 నుంచి 1984 వరకు 16 ఏళ్లు గ్రామ సర్పంచ్‌గా సేవలందించారు. మృతుడి ద్వితీయ కుమారుడు మాజీ జెడ్పీటీసీ జగదీష్‌చందర్‌రెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి తదితరులు గ్రామానికి చేరుకొని నర్సింహారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, మాజీ జెడ్పీటీసీలు ఉన్నారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

రఘునాథపల్లి: మండలంలో శుక్రవారం నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ రఘునందన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.